www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 18 మే 2023

5

కాకినాడ



వడదెబ్బ తగలి చికిత్స పొందుతూ...

పారిశుధ్య కార్మికుడు మృతి

ప్రజాశక్తి- కాజులూరు

వడదెబ్బ తగిలి గొల్లపాలెం పంచాయతీ పారిశుధ్య కార్మికుడు కావూరి రాంబాబు (64) మృతి చెందాడు. గొల్ల పాలెం ధనలక్ష్మి పేటకు చెందిన రాంబాబు మంగళవారం తన విధులు పూర్తి చేసుకుని ఇంటికి వచ్చి అకస్మాత్తుగా పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. బుధవారం ఉదయం పరిస్థితి విషమించడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రెజ్లింగ్ ఫెడరేషన్ చీఫ్ అరెస్టుకు డిమాండ్

-కాకినాడ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు

సమావేశంలో పాల్గొన్న ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు

ప్రజాశక్తి కాకినాడ

ఢిల్లీలో రెజ్లర్ల ఆందోళనకు మద్దతుగా కాకినాడ నగరంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్. రమణి అధ్యక్ష వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.శేష బాబ్జి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు, ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. రాజా, ఆర్‌పిఐ సీని యర్ నాయకులు ఏ. రామేశ్వరరావు, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కే. రామకష్ణ మోహన్, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ కే. సింహాచలం, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కెఎంఆర్ ప్రసాద్‌లు మాట్లాడుతూ లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) చీఫ్, బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ అరెస్ట్ చేయాలని మహిళ రెజ్లర్ల చేస్తున్న ఆందోళనకు ప్రజా సంఘాలు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నాయ న్నారు. బ్రిజ్ భూషణ్ అరెస్ట్ చేయాలని దేశ రాజధానిలో గత 23 రోజుల నుండి ఆందోళన చేస్తున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీ కనీసం మాట్లాడకపోవడం దారుణమన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి మహిళలపై, దళితులపై, గిరిజనులపై అత్యాచారాలు, దాడులు పెరిగిపోయన్నారు. రెజ్లర్లలు లైంగిక దాడి జరిగిందని ఆందోళన చేస్తుంటే ఈ సమస్యను పరిష్కరించ కుండా ఆందోళన చేస్తున్న వారిపై దాడి చేయడం, ఇబ్బందికి గురి చేయడం దారుణమన్నారు. నిరసన తెలుపుతున్న రెజ్లర్లకు బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ నిరసన ఆపకపోతే మీకే ప్రమాదం అని భయపెట్టడం ఏంటని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా రెజ్లర్ల చేస్తున్న ఆందోళనకు మద్దతుగా 18వ తేదీన గ్రామ, వార్డు, ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేయాలని 20వ తేదీని జిల్లా కేంద్రంగా పెద్ద ఎత్తున మహిళలను, విద్యార్థులను, యువకులను, క్రీడాకారులను కలుపుకుని ఆందోళన చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎం. కష్ణమూర్తి, వి చంద్రావు, వి రవికుమార్, కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పన్ను పెంపు నిర్ణయం ఉపసంహరించాలి

- సిఐటియు, ట్రాన్స్‌పోర్ట్ సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - కాకినాడ

రవాణా వాహనాలపై క్వార్టర్లీ ట్యాక్స్ భారీగా పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సిఐటియు ట్రాన్స్పోర్ట్ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, ట్రాన్స్‌పోర్ట్ కన్వీనర్ కె సత్తిబాబు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

రాష్ట్రంలో ప్రైవేటు ట్రాన్స్ పోర్ట్ రంగం కోవిడ్ సమయంలో అనేక ఇబ్బందులు పడి ఇప్పుడిప్పుడే కోలుకుంటుందన్నారు. ఇప్పటికే ఫైనాన్సు చెల్లించలేక, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి, స్పేర్ పార్ట్ల ధరలు పెరిగి, రోడ్లు సక్రమంగా లేక ట్రాన్స్ పోర్ట్ రంగం చాలా ఇబ్బందులు పడుతుందన్నారు. పక్క రాష్ట్రాల్లో వందల రూపాయలుగా ఉన్న గ్రీన్ ట్యాక్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వేలాది రూపాయలు వసూలు చేయడం చాలా దారుణమన్నారు. రవాణా వాహనాలపై రోడ్ ట్యాక్స్ 25 నుండి 30 శాతం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సిఐటియు ట్రాన్స్‌పోర్ట్ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ట్రాన్స్‌పోర్ట్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వీరబాబు, సత్తిబాబులు కోరారు.

రవాణాపై బాదుడే... బాదుడు

- 25 నుంచి 30 శాతం వరకూ
- త్రైమాసిక పన్ను పెంచిన ప్రభుత్వం
- ట్రాన్స్‌పోర్టర్లకు తప్పని అదనపు భారం
- రోడ్డున పడతామంటున్న వాహన యజమానులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

వివిధ ట్రాన్స్‌పోర్ట్ వాహనదారులకు త్రైమాసిక పన్ను పెంపుతో రాష్ట్ర ప్రభుత్వం మరో షాకిచ్చింది. 25 నుంచి 30 శాతం వరకూ పెంచుతూ నిర్ణయం తీసుకుంది. సర్కారు తీరుతో నష్టాలు తప్పవని, రోడ్డున పడతామని సరుకు, ప్రయాణికుల రవాణా వాహన యజమానులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 20 టన్నుల సామర్థ్యం గల మార్కెట్ లారీలు మూడు వేలు ఉన్నాయి. ఒక్కో లారీకి డ్రైవర్, క్లీనర్‌లు నలుగురు, యజమాని, దానిపై పనిచేసే కూలీలు మరో నలుగురు ఇలా 10మంది వరకూ ఆధార పడుతుండగా... సుమారు 95వేల మంది కుటుంబాలను పోషిచుకుం టున్నారు. అలాగే సుమారు 800 వరకూ మ్యాక్సీ క్యాబ్, మ్యాజిక్ క్యాబ్ వాహనాలున్నాయి. వీటిపై డ్రైవర్లు, ఓనర్లు కూడా ఉపాధిని పొందుతున్నారు. సుమారు1500 కుటుంబాలు వీటిపై ఆధారపడి జీవిస్తున్నాయి. కాకినాడ, రాజమహేంద్రవరం, పిఠాపురం, సామర్లకోట, పెద్దాపురం, అమలాపురం, రావులపాలెం తదితర పలు ప్రాంతాల్లో సుమారు 800 వరకూ ప్రైవేటు టూరిస్టు,ట్రావెల్స్ బస్సులు, మరో 2,000 వరకూ ట్యాక్సీలు నడుపుతున్నారు. ఒక్కో బస్సుకి ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు క్లీనర్లు పనిచేస్తూ ఉపాధిని పొందుతున్నారు.

● అదనపు భారంతో సతమతం

వైసిపి ప్రభుత్వం రవాణా వాహనాలపై పన్నులను పొరుగు రాష్ట్రాల కంటే ఎక్కువుగా పెంచింది. 3 నెలలకు ఒకసారి కట్టే పన్నులను 6 టైర్ల లారీలకు రూ.3940 నుంచి రూ.4,790కి, 10 టైర్ల లారీలకు రూ.6,580 నుంచి రూ.8,390, 12 టైర్ల లారీలకు రూ.8,520 నుంచి రూ.10,910, 14 టైర్ల లారీలకు రూ.10,480 నుంచి రూ.12,430కి, 16 టైర్ల లారీలకు రూ.11,980 నుంచి రూ.15,590కు పెంచింది. మ్యాక్సీ క్యాబ్ 7 సీట్లు ఆటోలకు రూ.4,550 టాక్స్ వసూలు చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు 2.75లక్షల చదరపు కిలో మీటర్లకు ఈ టాక్స్ ఉండేది. అయితే రాష్ట్రం విడిపోయినా కేవలం 1.62 లక్షల చదరపు కిలోమీటర్లు పరిధికి కూడా ఎపి ప్రభుత్వం ఇదే టాక్స్ వసూలు చేస్తోంది. తెలంగాణ ప్రాంతాలకు వెళుతుంటే మ్యాక్సీ క్యాబ్‌లకు ఏడు రోజులకు రూ.1,650 టాక్స్ చెల్లించాల్సి వస్తోంది. ఇప్పుడు మరో 25 నుంచి 30శాతం వరకు టాక్స్ పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో అనేకమంది వాహనదారులపై అదనపు భారం భారీగా పడుతుంది. తమిళనాడు రాష్ట్రంలో త్రైమాసిక పన్ను ఇదే మ్యాక్సీ క్యాబ్ వాహనాలకు కేవలం రూ.1800 మాత్రమే వసూలు చేస్తున్నారు. ఒడిస్సా.. మహారాష్ట్ర... చత్తీస్‌ఘడ్ వంటి రాష్ట్రాల్లో కూడా ఎపి కంటే తక్కువ టాక్స్‌ను వసూలు చేస్తున్నారు. అలాగే టూరిస్ట్ బస్సులకు ఒక్కో సీటుకి రూ.1000, ఆల్ ఇండియా పర్మిట్ సీట్లకు అయితే రూ.1600 చెల్లిస్తు న్నారు ఇప్పుడు మరో 30 శాతం పెంచితే భారం తప్పదని వాహనదారులు వాపోతున్నారు. పెరిగిన పన్నులకు అనుగుణంగా ప్రయాణికులపై భారం వేయాల్సి వస్తున్నందున కిరాయిలు కూడా తగ్గుతున్నట్లు టూరిస్ట్ బస్సు యజమానులు తెలిపారు. పన్నుల పెంపు ప్రభావం ఆయా వాహనాల యజమానులపైనే కాకుండా నిత్యావసర సరుకుల ధరలపై కూడా తీవ్రంగా ఉంటుంది. కరోనాతో నేటికీ సంక్షోభంలో నడుస్తున్న ఈ రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరింత కుదేలు చేస్తోందని పలువురు యజమానులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు సామాన్య ప్రజలపై భారాలు మోపడం సరికాదని చెబుతున్నారు.

● పన్ను పెంపు వెంటనే ఉపసంహరించుకోవాలి

ట్రాన్స్ పోర్ట్ వాహనాలపై త్రైమాసిక పన్ను మరో 30 శాతం పెంచుతూ ఎపి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శోచనీయం. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఇప్పటికే భారీ మొత్తంలో పన్నులు వసూలు చేస్తున్నారు. పెంచిన పన్నును ప్రభుత్వం తక్షణమే ఉప సహరించుకోవాలి. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తాం.

నూకాల బలరాం, ట్రాన్స్ పోర్ట్ రంగం రాష్ట్ర నాయకులు

● వ్యాపారం బాగా తగ్గింది

ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వలన ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గింది. పెట్రోలు, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగాయి. స్పేర్ పార్ట్‌ల ధరలు ఆకాశాన్నంటాయి. ఈ నేపథ్యంలో మ్యాక్సీ క్యాబ్ వాహనాలకు వ్యాపారం బాగా తగ్గింది. కిరాయి పెంచేందుకు వీలు లేదు. ఒకవేళ పెంచినా వినియోగదారులు ఎక్కడం లేదు. మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా మరో 30 శాతం టాక్స్ పెంచడం దారుణం.

కె.సత్తిబాబు, కాకినాడ జిల్లా ట్రాన్స్ పోర్ట్ రంగం కన్వీనర్

వికలాంగులకు అలవెన్స్‌ల మంజూరు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం భవిత కేంద్రంలో చదివే 24 మంది వికలాంగులకు నెలకు రూ.300 చొప్పున 10 నెలలకు రూ.72,000 అలవెన్స్‌లు మంజూరయ్యాయని భవిత కేంద్రం సహిత ఉపాధ్యాయుడు బి దుర్గా ప్రసాద్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే తల్లి సహాయంతో కేంద్రానికి వచ్చే ఒకరికి నెలకి రూ.300 చొప్పున 10 నెలలకు రూ.3000 ఎస్కార్ట్ అలవెన్స్ మంజూరయ్యా యన్నారు. భవిత కేంద్రానికి రాని వికలాంగ బాలలకు ఇచ్చే హోమ్ఃబేస్డ్ ఎడ్యుకేషన్ అల వెన్స్ 19 మందికి నెలకు రూ.300 చొప్పున 10 నెలలకు రూ.57 వేలు, ఇతర పాఠశా లలు, భవిత కేంద్రంలో 36మంది వికలాంగ ఆడపిల్లలకు నెలకు రూ.200 చొప్పున గర్ల్ స్టయిఫండ్ పది నెలలకు రూ.72,000 మంజురయ్యాయని పేర్కొన్నారు.

ఐటిలో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి - గండేపల్లి

ఐటికి సంబంధించి మిషన్ లెర్నింగ్‌తో ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయని ప్రొఫెసర్ కె.సత్యబాబు విద్యార్థులకు తెలిపారు. సూరంపాలెం. ఆదిత్య ఇంజ నీరింగ్ కళాశాల ఐటి విభాగంలో మెషిన్ లెర్నింగ్ అంశంపై బుధవారం ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. తెలిపారు. రిసోర్స్ పర్సన్ గా కర్నూల్ ట్రిపుల్ ఐ.టి. కంప్యూటర్ సైన్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. సత్యబాబు మెషిన్ లెర్నింగ్ అప్లికేషన్ ఆవశ్య కత, ఉపాధి అవకాశాలపై వివరించారు. కార్య శాలలో ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాసరెడ్డి, డీన్. ఎస్.రమాశ్రీ, ఐటి విభాగాధిపతి ఎం.వి. రాజేష్, ప్రొఫెసర్ రాజబాబు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



సబ్‌ప్లాన్ గ్రామాలను 5వ షెడ్యూల్‌లో కలపాలి

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రాజశేఖర్

- పెద్దమల్లాపురం కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి, రాజశేఖర్

ప్రజాశక్తి - రౌతులపూడి

రౌతులపూడి మండలంలోని రాఘవపట్నం పంచాయతీ మాతీయపేట, కొత్తూరు, ముకులూరు, ఎస్.పైడిపాల గ్రామాల్లో గిరిజనులతో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం రాజశేఖర్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ గతంలో రంపచోడవరం ఐటిడిఏ ద్వారా గిరిజన గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, ప్రస్తుతం గిరిజన ప్రాంతం మైదాన ప్రాంతంలో కలిసి ఉండడం వలన అభివృద్ధికి దూరంగా గిరిజన గ్రామాలు ఉన్నాయని వివరించారు. ప్రస్తుతం రంపచోడవరం ఐటిడిఏ, శంఖవరం, ప్రత్తిపాడు, రౌతులపూడి మండల అధికారులను అడిగిన సమాచారం మేరకు, మిగిలిన గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్లో చేర్చేడానికి ఉద్యమం చేయడానికి సిద్ధపడాలని పిలుపు నిచ్చారు. సమావేశాల్లో పి.వర హాలు, జర్త ముసలయ్య, ముర్ల దొంగబ్బాయి, తారాకేష్, నూక రాజు, సత్యనారాయణ, కె.రాజబాబు, రాంబాబు పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరంలో జరుగుతున్న పూడికతీత పనులను నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నర సింహారావు బుధవారం పరిశీలించారు. జగన్నాథపురం వంతెన, సంతచేరువు ప్రాంతంలో పర్యటించిన ఆయన అక్కడ జరుగుతున్న డీ-సిల్టేషన్ పనులను పరిశీలించారు. అక్కడ విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. వర్షాలు పడే లోపుగా పూడిక తీత పనులను పూర్తి చేయాలని కోరారు. ఆ మేరకు డి-సిల్టేషన్ పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. కమిషనర్ ఆర్. మహేష్ కుమార్ అదేశాల మేరకు పారిశుధ్య విభాగం, ఇంజనీరింగ్ శాఖలు సమన్వయంతో నిచేసి ప్రణాళికా బద్ధంగా డి సిల్టేషన్ పనులు చేపట్టాలని కోరారు.. ఈ సందర్భంగా తడి పొడి చెత్త సేకరణ ను, చెత్తను విభజించి ఇస్తున్న విధానాన్ని పర్యవేక్షించారు. హూపర్ టిప్పర్ వాహనాల ద్వారా చెత్తను తరలిస్తున్న తీరును పర్యవేక్షించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు

- ఆర్‌బి పట్నంలో దొంగ మస్టర్లతో రూ 80 వేలు పక్కదారి
- సామాజిక తనిఖీల్లో బయటపడ్డ అవినీతి

సామాజిక తనిఖీ సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం రాయ భూపాలపట్నంలో నిర్వహించిన ఉపాధి హామీ పథకం పనుల్లో దొంగ మస్తర్లు వేసి ఫీల్డ్ అసిస్టెంట్ రూ.80 వేలు అవకతవకలకు పాల్పడినట్లు ఉపాధి హామీ పథకం మండల సామాజిక తనిఖీలో గుర్తించారు.బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎపిఒ బి.రాజబాబు అధ్యక్షతన జరిగిన సామాజిక తనిఖీ సభలో డ్వామా పిడి అడపా వెంకటలక్ష్మి, జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకే సత్యవతి లు ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబం ధించి మండలంలో రూ.10 కోట్లు విలువ చేసే 1343 ఉపాధి పనులు జరిగాయని ఎపిఒ రాజబాబు తెలిపారు. ఈ పనులపై తనిఖీలు నిర్వహించగా మండల పరిధిలో 23 గ్రామాలుండగా 22 గ్రామాల్లో పనులన్నీ సక్రమంగా జరిగాయన్నారు. రాయ భూపాలపట్నంలో ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణ మస్తర్లలో అవకతవకలకు పాల్పడినట్లు ఆ గ్రామంలో జరిగిన గ్రామ సభలో ఫిర్యాదులు అందాయన్నారు. వీటిపై పరిశీలన జరపగా ఫీల్డ్ అసిస్టెంట్ దొంగ మస్తర్లు వేసినట్లు, రూ 80 వేలు అవినీతి పాల్పడినట్టు గుర్తించామన్నారు. డ్వామా పీడీ వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణ పై చర్యలు తీసుకుంటామని, రూ 80 వేలు రికవరీ చేస్తామని ప్రకటించారు. ఈ సభలో ఎండిఒ కరక హిమమహేశ్వరి,జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కాకినడ 37 వ డివిజన్‌లో ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

సమస్యలపై సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగరంలో 37వ డివిజన్ కచేరిపేటలో స్థానిక సమస్యలు పరిష్కరించాలని బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో నగర నాయకులు ర్యాలీగా వెళ్లి సచివాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సచివాలయ అడ్మిన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం కాకినాడ నగర కమిటీ సభ్యులు టి.రాజా, కె.నాగజ్యోతి మాట్లాడుతూ కాకినాడ కలెక్టర్ ఆఫీస్‌కి అర కిలోమీటర్‌లో ఉన్న కచేరిపేటలో కాలువ గట్టు మీద ఉంటున్న ప్రజలకు మంచినీటి సౌకర్యం పూర్తిస్థాయిలో లేదన్నారు. వారంలో రెండు, మూడు రోజులు మాత్రమే మంచినీరు వస్తుందన్నారు. ప్రతి ఇంటికి మంచినీటి కుళాయిలు సౌకర్యం ఉండి పన్నులు చెల్లిస్తున్నప్పటికీ తాగునీరు మాత్రం రావడం లేదని విమర్శించారు. కాలువ గట్టుమీద మూడు కరెంట్ స్తంభాలు వేయాల్సి ఉండగా ఒక స్తంభం నుండే దాదాపుగా 15 ఇళ్లకు కరెంటు వైర్లు లాగడంతో వైర్లన్నీ ఇళ్ల మీద, రోడ్డుమీద నడిచి వెళ్లే వాళ్లకి అందే అంత ఎత్తులో ఉన్నాయని తెలిపారు. తక్షణం మరొక రెండు కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఈశ్వరరావు, సింహాచలం, చంద్రరావు, భూలక్ష్మి, గౌరీ, భవాని, లోవ, మంగ, దుర్గ, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను సత్కరిస్తున్న ఎంపిపి శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు

టెన్త్ ఉత్తమ విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి - కోటనందూరు

కోటనందూరు మండలంలో ప్రభుత్వ పాఠశాలలో 2023 పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నీలి కావ్య శ్రీ, గంటా తులసి, అల్లు దేవి, కీర్తి వర్ధన్ లను బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి లగుడు శ్రీని వాస్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ కళాశాల ధీటుగా ఆధునికీకరించి నాణ్యమైన గుణాత్మకమైన విజన్ అందించడం వల్లే కార్పొరేట్ విద్యాసంస్థల కన్నా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధించారన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎ.శ్రీనివాసరావు, హెచ్ఎం సత్యనారాయణ, మండల కోఆప్షన్ సభ్యులు జగటాల కోట సత్తిబాబు, కమిటీ చైర్మన్ ఉల్లూరి శ్రీను, వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు గొర్ల రామచంద్రరావు, మండల వ్యవసాయ శాఖ అడ్వైజర్ కమిటీ కమిటీ చైర్మన్ సుర్ల రాజు వైసిపి నాయకులు కొర్రోపలు కృష్ణ, దొడ్డు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నదానం

ప్రజాశక్తి -రౌతులపూడి

రౌతులపూడి మార్కెట్ సెంటర్‌లోలో ఆంజనేయ స్వామి ఉత్సవాలు కార్యక్రమంలో భాగంగా ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం భారీ అన్నదానం నిర్వహించారు మండలంలోని వివిధ గ్రామాలనుంచి 2000 మంది యాత్రికులు అన్నదానంలో పాల్గొన్నారు.

భవిష్యత్‌కు గణితం దిక్సూచి



ఎంఎస్ఎన్ వేసవి శిబిరంలో గణితం,డ్రాయింగ్‌పై శిక్షణను ఇస్తున్న ఉపాధ్యాయులు రవిశంకర్, చిన్నబాబు పెద్దాపురం గ్రంథాలయంలో యోగాసనాలు నేర్పుతున్న లచ్చిబాబు

- ఉత్సాహంగా వేసవి వినోదం

ప్రజాశక్తి - కాకినాడ

ప్రతి విద్యార్థికి గణితం భవిష్యత్‌కు దిక్సూచి అనిప్రముఖ గణిత అవధాని, పాఠ్యపుస్తక రచయిత పి. రవిశంకర్ విద్యార్థులకు సూచించారు. స్థానిక జగన్నాథపురం ఎంఎస్ఎన్ చారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల నందు వి.బి.వి.ఆర్ ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేసవి వినోదం కన్వీనర్ కేసరి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహిస్తున్న రెండవ రోజు ఉత్సాహభరితంగా జరిగింది. ఈసందర్భంగా రిసోర్స్ పర్సన్‌గా రవిశంకర్ గణితంలో అనేక పజిల్స్, టిప్స్ నేర్పించారు. డ్రాయింగ్ మాస్టర్ ఎం.చిన్నబాబు పిల్లలకు బొమ్మలు వేయడంలోని మెళకువలు తెలుపుతూ కర్టెన్స్‌పై బొమ్మలువేయడం నేర్పించారు. **పెద్దాపురం** స్థానిక వరహాలయ్య పేటలోని యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి వినోదం శిబిరంలో విశాఖ స్పోర్ట్స్ కరాటే ఉపాధ్యక్షులు, బిఎస్‌బికె సౌత్ జోన్ ప్రధాన కార్యదర్శి మల్లా సుధాకర్ విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన విద్యార్థులు పలు కరాటే విన్యాసాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కరాటే టీచర్ దుంగల పూజితా సూర్యశ్రీ, రొంగల అరుణ్ కూనిరెడ్డి అరుణ, రవికుమార్, అమృత, నమ్రత, మంజుల, జ్యోత్స్న డి.కృష్ణ పాల్గొన్నారు. పెద్దాపరం శాఖా గ్రంథాలయంలో 10వ రోజు వానపల్లి లచ్చిబాబు బాలలకు పద్మాసనం, వజ్రాసనం తదితర యోగాసనాల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చి, వాటి ద్వారా లభించే శారీరక, మానసిక ఆరోగ్యాన్ని వివరించారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** మండలం వేట్లపాలెం శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు చదవడం, డ్రాయింగ్, తదితర అంశంలో శిక్షణ ఇచ్చారు. జూన్ 11వ తేదీ వరకు నిర్వహించుచున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు వారు శిక్షణ పొందిన అంశాల నుండి పోటీలు నిర్వహించి బహుమతి అందజేయనున్నట్లు గ్రంథాలయ అధికారి పెదిరెడ్ల విమలాదేవి చెప్పారు. **యు.కొత్తపల్లి మండలం** ఉప్పాడ శాఖా గ్రంథాలయం అధికారి టి.నళిని,ఉపాధ్యాయిని ఎస్.లోహిత ఆధ్వర్యంలో విద్యార్థులకు జనరల్ మాథ్స్‌పై సుమారు 28 మంది విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు.

పెద్దాపురం సూర్యారావు భవనంలో కరాటే శిక్షణ

వేట్లపాలెం గ్రంథాలయంలో కథలు చదివిస్తున్న విమలాదేవి

ఉప్పాడ గ్రంథాలయంలో లెక్కల పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులు

నేరాలు ఘోరాలు

కెనాల్ రోడ్డులో బోల్తా పడిన ధాన్యం లోడు ట్రాక్టర్

ధాన్యం ట్రాక్టర్ బోల్తా

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట కాకినాడ ప్రధాన రహదారి కేనాల్ రోడ్డులో బుధవారం ధాన్యం లోడుతో వెళుతున్న ట్రాక్టర్ బోల్తా పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ట్రాక్టర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి ట్రాఫిక్ ఎస్.ఐ అడపా గరగరావు సిబ్బందితో చేరుకుని ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

బైకును ఢీకొన్న ట్రాక్టర్
ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కాజులూరు

గొల్లపాలెంలో కాకినాడ - కోటిపల్లి రహదారిలో జరిగిన ప్రమాదంలో నామా సత్యనారాయణ తీవ్రంగా గాయపడినట్టు స్థానికులు గొల్లపాలెం పోలీసులు తెలిపారు. కాకినాడ రూరల్ ఎంపిఒగా పనిచేస్తున్న నామా సత్యనారాయణ స్వగ్రామం కాజులూరు వస్తుండగా గొల్లపాలెం శ్రీ రామ నర్సింగ్ హెూమ్ మలుపులో కాకినాడ నుండి ద్రాక్షారామం వెళ్తున్న ట్రాక్టర్ వేగంగా వెనుక నుండి ఢీకొనడంతో సత్యనారాయణకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు పక్కనే ఉన్న ఆసుపత్రి కి తరలించారు. కేసును గొల్లపాలెం ఎస్ఐ. తులసీ రామ్ నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

కొత్తపల్లి పాత తహశీల్దార్ కార్యాలయం సమీపంలో పిచ్చి కుక్క ఇద్దరిపై బుధవారం దాడి చేసింది. ఈ దాడిలో గ్రామానికి చెందిన బాలుడు బొజ్జ మణికంఠ, సానా గోపాలం పిచ్చికుక్క దాడిలో తీవ్ర గాయాల పాలయ్యారు. మణికంఠ స్థానిక కొత్తపల్లి పిహెచ్ సి కి తరలించగా అక్కడ చికిత్స అనంతరం, మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ పై తరలించారు.గోపాలం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు జైలు

ప్రజాశక్తి-కడియం

భార్య మృతికి కారణమైన భర్తకు కోర్టు రూ.2వేల జరిమానాతో పాటు రెండేళ్ల జైలు శిక్ష విధించి పాములమెట్ట గ్రామానికి చెందిన ఉర్ల సురేష్ తన భార్య ఎస్తేరు రాణి ని వేధించాడు. మనస్థాపం చెందిన ఆమె 2019లో జేగురుపాడు కాలువ వంతెన పై నుంచి గోదావరి కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంది. అప్పటి సిఐ బివి.సుబ్బారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కోర్టులో హాజరు పరచగా కోర్టు పై తెలిపిన విధంగా జరిమానా, జైలు శిక్ష విధించిందని పోలీసులు తెలిపారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గోపాలపురం

పశవులను చెరువులో నుంచి పైకి తోలే క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని గుడ్డిగూడెంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. గుడ్డిగూడెంకు చెందిన ముప్పిడి శ్రీను వత్తి రీత్యా కూలి పని చేస్తూ, తనకున్న పశువులను మేపుకుంటూ జీవిస్తాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం పనికి వెళ్లి వచ్చి అనంతరం తన పాక వద్ద ఉన్న పశువుల మేతకు తోలుకు వెళ్లాడుప. ఈ క్రమంలో పశువులు పానకాల చెరువులోకి దిగి ఎండకు పైకి రాకపోవడంతో వాటిని మేతకు తోలేందుకు శ్రీను చెరువులోకి దిగాడు. ఈ క్రమంలో చెరువులో మునిగిపోయాడు. చుట్టుపక్కల వారు చూసి అతనిని పైకి తీసినప్పటికే శ్రీను మతి చెందినట్లు తెలిపారు. భార్య రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.రామకృష్ణ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, శవ పంచనామా నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రుకి తరలించినట్లు తెలిపారు. మృతునికి ఇద్దరు పిల్లలుగా ఒకరికి వివాహమైనట్లు తెలిపారు.

సమావేశం లో మాట్లాడుతున్న వైద్యురాలు గౌతమి

వడదెబ్బ నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి
రాజపుడి పీహెచ్ సి డాక్టర్ గౌతమి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

వేసవి కాలంలో ఎండలు ఎక్కువగా ఉండుట వలన వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరిగి ప్రజలు వడదెబ్బకు గురి అయ్యే ప్రమాదం వుందని రాజ పూడి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్. కె.గౌతమి తెలియజేశారు. గురువారం మండలంలోని రాజపూడి పిహెచ్‌సిలో ఆరోగ్య సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసి తగు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్గించాలని ఆదేశిం చారు. ఎండ తీవ్రత వల్ల శరీర ఉష్ణోగ్రత కూడా 104.9 డిగ్రీల వరకు పెరిగి మెదడు మీద ప్రభావం చూపుతుందనీ, దీనివలన మెదడులోని ఉష్ణోగ్రత ను నియంత్రించే కేంద్రం (హైపో థలామస్) దెబ్బతిని వడదెబ్బకు గురి అవుతారన్నారు. ఎండలో తిరగటం వలన వేడిమికి చెమట పట్టి శరీరంలోని లవణాలు, నీటి శాతం తగ్గి డీ-హైడ్రేషన్‌కు గురి అవుతారనీ ఇది ప్రమాదకరం, ప్రాణాంతకమని తెలిపారు.

యానాం వార్తలు

విద్యార్థినికి సైకిల్ అందజేస్తున్న ఎంఎల్ఎ అశోక్

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థినీవిద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఉచిత సైకిల్స్ లను బుధవారం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఉచిత సైకిళ్ళ పంపిణీ చేయడానికి ప్రభుత్వం 339 సైకిళ్ళు మంజూరు చేసిందని వాటిని విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఉచిత సైకిళ్లు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈఏడాది యానాం నియోజకవర్గంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సిబిఎస్ఇ సిలబస్‌ను ప్రభుత్వం అమలు చేయనున్న దృష్ట్యా విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా నాణ్యమైన విద్య బోధించేలా ఉపాధ్యాయులు సంసిద్ధులై ఉండాలని, విద్యార్థులు కూడా ప్రభుత్వ సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గిరియాంపేట పెరంత లైవార్ కామరాజర్ హైస్కూల్‌లో-65 సైకిళ్లు దరియాలతిప్ప హైసూల్ లో-28 సైకిల్స్, శారదాప్రభుత్వ ఎయిడెడ్ స్కూల్-72 సైకిళ్లు, రెయిన్ కోట్‌లను విద్యార్థిని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎఒ మునిస్వామి,విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్, హెచ్ఎంలు దంగేటి త్రిమూర్తులు, సికె పద్మశ్రీ,చిక్కాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గిరియాంపేట తాగునీటి సమస్యపై ఎంఎల్ఎకు ఫిర్యాదు

గిరియాంపేట వీధుల్లో తాగునీటి సరిగ్గా అందడం లేదని స్థానికులు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కు బుధవారం పిర్యాదు చేశారు.దీనికి స్పందించిన ఆయన సంబంధిత పిడబ్ల్యుడి అధికారులతో మాట్లాడారు. వేసవికాలంలో తాగునీటి సమస్యలు రాకుండా తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆ భూమిని దేవస్థానానికి రాసివ్వలేదు

యానాం శివారు అడవి పొలంలోని తమకు చెందిన భూమిని దేవస్థానానికి రాసి ఇవ్వలేదని కసిరెడ్డి బ్రహ్మానందం కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం ఈ మేరకు పరిపాలనాధికారి మునుస్వామికి, డిటీ సత్య నారాయణకు కసిరెడ్డి శేషాయమ్మ తదితరుల సంతకాలతో వినతిపత్రం అందించారు. దేవస్థానం భూమి అని కొంతమంది ఇస్తున్న ఫిర్యాదులు వాస్తవం కాదని తెలిపారు.

సత్యం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దొరబాబు

దొరబాబు పరామర్శ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక నువ్వుల గుంట వీధి సచివాల కన్వీనర్ కొత్తపల్లి సత్యం మాతమూర్తి పాపయమ్మ ఇటీవల మతి చెందడంతో సత్యం కుటుంబ సభ్యులను బుధవారం వైసిపి నియోజకవర్గ ఇన్చార్జ్ దవులూరి దొరబాబు పరామర్శిం చారు. ఆయన వెంట వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్,ఆగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ,కౌన్సిలర్ విడదాసరి రాజా,కౌన్సిల్ కోఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ,వైసిపి నాయకులు బొడ్డు ప్రకాష్,తాటికొండ పెదకాపు ఉన్నారు.

ప్రమాద ఘటన స్థలంలో సీతారాంపురం వైపు ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్

రామకృష్ణ సత్కరిస్తున్న మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ

గండేపల్లి మండల తెలుగు యువత అధ్యక్షునిగా రామకృష్ణ

ప్రజాశక్తి - గండేపల్లి

మండలం సూరంపాలెం గ్రామానికి చెందిన కుంచే రామకృష్ణ మండల యువత అధ్యక్షుడిగా నియమితులయ్యారు ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ స్వగృహంలో గండేపల్లి మండలం సూరంపాలెం గ్రామానికి చెందిన కుంచే రామకృష్ణను గండేపల్లి మండల తెలుగు యువత అధ్యక్షుడిగా ప్రకటించిన రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ రామకృష్ణను పార్టీ కండువాతో రామకృష్ణను సత్కరించగా, పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. తనను మండల తెలుగు యువత అధ్యక్షుడిగా నియమించినందుకు వారికి కతజ్ఞతలు తెలియజేసి, పార్టీ ప్రతిష్ట కోసం కష్టపడి పనిచేస్తానని రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో లచ్చయ్య దొర మండల పార్టీ అధ్యక్షులు పోతుల మోహనరావు, కాకినాడ జిల్లా టిడిపి క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు కన్నబాబు, మారిశెట్టి భద్రం, జంపన సీతారామచంద్ర వర్మ, పాలచర్ల సత్యనారాయణ, బదిరెడ్డి అచ్చన్న దొర, మండపాక అప్పన్న దొర, బోదిరెడ్ల సుబ్బారావు, మలిరెడ్డి వెంకట శ్రీధర్ (సిరి) గల్లా రాంబాబు గొరిజాల వెంకన్న దొర, నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఆల్ క్యాస్ట్ యూనియన్ అధ్యక్షునిగా వెంకటరెడ్డి

ప్రజాశక్తి - ఆలమూరు

జొన్నాడకు చెందిన ఆల్ క్యాస్ట్ కార్మికుల యూనియన్ అధ్యక్షులుగా రెండోసారి తాడి వెంకట కృష్ణారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయితే బుధవారం జరగవలసిన ఎన్నికల నియామకంలో భాగంగా రాజమహేంద్రవరం డివిజనల్ కో-ఆపరేటివ్ కార్యాలయం నుండి వచ్చిన ఏమ్.రామభక్తుడు ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తూ ఉండగా వారి సమక్షంలో యూనియన్ సభ్యులు వెంకటరెడ్డిని అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పరమటి వెంకట్రావు, కార్యదర్శిగా లంక రాజును ఎన్నుకోగా పదవి బాధ్యతలు ఐదు సంవత్సరాలు కొనసాగనున్నట్లు ఎన్నికల అధికారి తెలియజేశారు. ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ మాపై నమ్మకం ఉంచి ఆల్ క్యాస్ట్ కార్మికుల యూనియన్ బాధ్యతలు అప్పగించినందుకుగాను ధన్యవాదాలని తెలియజేశారు. యూనియన్ మరింత బలోపేతానికి కషి చేస్తామని వారు అన్నారు. అనంతరం ఎన్నికైన సభ్యులను పలువురు అభినందించారు.కార్యక్రమంలో యూనియన్ నెంబర్లు నాగిరెడ్డి ఆదినారాయణ, వీరి గోవిందు, కర్రి సురేష్, గుత్తుల ఏడుకొండలు, గెద్దాడ సత్యనారాయణ, వేల్పూరి రామకష్ణ, తదితర సభ్యులు పాల్గొన్నారు.

మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యత

- దిశ పోలీస్ స్టేషన్లలో ఎస్‌పి తనిఖీలు

దిశ పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌పి సతీష్‌కుమార్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ జిల్లా ఎస్‌పి ఎస్. సతీష్‌కుమార్ కాకినాడ నగరంలోని జిల్లా దిశ మహిళా పోలీస్ స్టేషన్లను బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దిశా పోలీస్ స్టేషన్ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, బాధిత మహిళలు, బాలికల సమస్యలపై స్టేషన్ సిబ్బంది వ్యవహరించే పని తీరును ఎస్‌పికి దిశ పోలీస్ స్టేషన్ డిఎస్‌పి జయరాం ప్రసాద్ వివరించారు. అనంతరం ఎస్‌పి సతీష్‌కుమార్ మాట్లాడుతూ మహిళలు, బాలికల ఫిర్యాదు లపై తక్షణం స్పందించి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలతో న్యాయ స్థానాల ద్వారా వారికి కఠిన శిక్షలు పడేలా దిశ సిబ్బంది కృషి చేయాలని. పాఠశాలలు, కళాశాలలకు వెళుతున్న బాలికలు, యువతుల భద్రతకై పోలీసు శాఖ ద్వారా అమల్లో ఉన్న సేవలు, దిశా, ఫోక్సో చట్టాలు, ఈవ్‌టీజింగ్, ఎల్లో ఫ్‌మెంట్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు మొదలగు అంశాలపై మహిళా పోలీసుల యొక్క సేవలను ఉపయోగించుకుని విరివిగా అవగా హన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్‌పి దిశ సిబ్బందిని ఆదేశించారు. దిశా పోలీస్ స్టేషన్‌కు అనుబంధంగా ఉండే ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్, కాకినాడ జిజిహెచ్ ఆవరణలో ఉన్న దిశా వన్ స్టాప్ సెంటర్‌ను ఎస్పీ సందర్శించి ఈ కేంద్రాల యొక్క పనితీరును అక్కడి సిబ్బందితో మాట్లాడి మహిళలు, బాలికల రక్షణ విషయంలో మరింత మెరుగైన సేవలు అందించాలనారు. అనంతరం నిర్మాణంలో ఉన్న దిశా పోలీస్ స్టేషన్ భవనాన్ని, దిశా వన్ స్టాప్ సెంటర్ పక్కా భవన నిర్మాణాన్ని పరిశీలించి తక్కువ కాల వ్యవధిలో రెండూ నిర్మాణం పూర్తిచేసుకుని అందుబాటులోకి వచ్చేలా రోజువారీ జరుగుతున్న పనులను పర్యవేక్షించాలని దిశ డిఎస్‌పిని ఎస్‌పి సతీష్‌కుమార్ ఆదేశించారు. ఆయన వెంట దిశా స్టేషన్ పోలీసు అధికారుచలు సిబ్బంది, ఐసిడిఎస్ పీడీ ప్రవీణ, లీగల్, వైద్య విభాగాల అధికారులు పాల్గొన్నారు.

20 నుంచి మేరీ లైఫ్... మేరా స్వచ్ఛ షహర్

కాకినాడ కార్పొరేషన్ సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మహేష్‌కుమార్

పాత వస్తువుల సేకరణకు 14 కేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మేరీ లైఫ్.. మేరా స్వచ్ఛ షహర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ ఆర్. మహేష్‌కుమార్ చెప్పారు. కాకినాడ స్మార్ట్ సిటీ సమావేశం మందిరంలో అధికారులతో కమిషనర్ చర్చించారు. పాత వస్తువుల సేకరణ కోసం కాకినాడ నగరంలోనికాకినాడ నగరంలోని బోట్ క్లబ్ పార్క్, జన్మభూమి పార్క్, సాంబమూర్తి నగర్ లోని లైబ్రరీ బిల్డింగ్ అంబేద్కర్ పార్క్, ఎంజి స్కూల్ ఎదురుగా మాస్టర్ కార్యాలయం, ఏటిమొగ వెహికల్ యార్డ్, జగన్నాథపురం పాత ఈసేవ బిల్డింగ్, ముగ్గుపేట కమ్యూనిటీ హాల్, జ్యోతుల మార్కెట్ ఈ వేస్ట్ సెంటర్, పాత కార్పొరేషన్ కార్యాలయం, కొత్తపేట చిన్న మార్కెట్ వద్ద గల కమ్యూనిటీ హాల్, వార్ఫ్ రోడ్ కమ్యూనిటీ హాల్, బాల భవన్ వద్ద మాస్టర్ ఆఫీస్, వివేకానంద పార్క్, శ్రీనివాస బ్యాంక్ కాలనీ షెడ్ వద్ద ఈ నెల 20వ తేదీ నుండి జూన్ 5వ తేదీ వరకు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పాత వస్తువులను సేకరించనున్నట్టు తెలిపారు. కార్యక్రమాన్ని పర్యవేక్షిం చేందుకు నోడల్ అధికారులను కూడా నియమించినట్టు కమిషనర్ మహేష్‌కుమార్ తెలిపారు. ఎడిసి నాగ నరసింహారావు మాట్లాడుతూ రెడ్యూస్- రీ సైకిల్ -రీ యూజ్ నినాదంతో చేపడుతున్న కార్యక్రమానికి ప్రజలు కూడా తమ వంతు సహకారించాలని కోరారు. సమావేశంలో డిఇ మాధవీ, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, టిపిఆర్ఒ మానే కృష్ణమోహన్, కార్పొరేషన్ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు. **పెద్దాపురం** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరిం చుకుని కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ నెల 21వ తేదీ నుండి జూన్ 4వ తేదీ వరకు ప్రతి సచివాలయం పరిధిలో పనికిరాని ప్లాస్టిక్ వస్తువులు, కాగితాలు, అట్టలు పుస్తకాలు, బట్టలు, బూట్లు, చెప్పులు సేకరించాలని మున్సిపల్ కమిషనర్ జె సురేంద్ర తెలిపారు. మేరా లైఫ్ -మేరా స్వచ్ఛ షహర్‌లో భాగంగా రెడ్యూస్ - రీసైకిల్ - రీ యూజ్ (ఆర్ ఆర్ ఆర్) పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహిస్తు న్నామన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసే స్టాల్స్ వద్ద ప్రజలు తమకు పనికిరాని వస్తువులను అందజేయా లన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనే విధంగా మెప్మా, మున్సిపల్ సిబ్బంది, మహిళలు పట్టణ పరిధిలో బుధవారం నుండి ప్రదర్శనలు, కరపత్రాలు, బ్యానర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నారన్నారు. ప్రజలందరూ పాల్గొని త్రిపుల్ ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పెద్దాపురంలో త్రిపుల్ ఆర్ పై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ సురేంద్ర

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- గ్రామాల్లో పోలీసుల అవగాహనా సదస్సులు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ ఐపిఎస్ ఆదేశాల మేరకు మండలంలోని కాండ్రేగుల, గోళ్ళలగుంట గ్రామాల్లో జగ్గంపేట సిఐ బి.సూర్య అప్పారావు ఆధ్వర్యంలో జగ్గంపేట ఎస్ఐ విద్యాసాగర్ గ్రామ ప్రజలకు బుధవారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సూర్య అప్పారావు మాట్లాడుతూ తాగి మోటార్ సైకిల్ నడపకూడదని, ప్రతి ఒక్కరికి లైసెన్స్ కలిగి ఉండాలని అదేవిధంగా వేసవికాలం దృష్ట్యా గ్రామాల్లో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి సమయంలో ఆరు బయట లేదా మేడపైన నిద్రించేవారు ఇళ్లకు తాళాలు పటిష్టంగా వేసుకోవాలని, విలువైన వస్తువులు ఒంటిపై ధరించరాదన్నారు. ముఖ్యంగా వేసవి సెలవులకు, వివాహాది శుభకార్యాలకు ఇల్లు విడిచి కుటుంబ సమేతంగా వెళ్లేవారు ముందుగా జగ్గంపేట స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. అదేవిధంగా విలువైన వస్తువులు ఉంటే వాటిని బ్యాంకులో లాకర్స్‌లో భద్రపరుచుకోవాలని కోరారు. ముఖ్యంగా కాలనీలో నిషేధిత పదార్థాలైన గంజాయి, సారా అమ్మకాలు తయారీ వంటి వాటికి పాల్పడితే తక్షణం పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గ్రామస్తుల్లో నుంచి ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుషులు మొత్తం ఐదుగురితో పీస్ కమిటీ ఏర్పాటు చేశారు. వీరు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. జగ్గంపేట ఎస్ఐ సిహెచ్ విద్యాసాగర్ మాట్లాడుతూ ఎవరైనా సారా అమ్మినా, తయారుచేసినా చట్టరీత్యా నేరం అని అలాంటి వాళ్లు ఎవరైనా ఉంటే నాకు సమాచారం ఇవ్వాలని, మీకు ఏ సమస్య అయినా ఉంటే మీకు అందుబాటులో మహిళా పోలీస్ ఉంటారని వాళ్లకు తెలియచేయాలని సూచించారు.

ప్రజలతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

తాళ్లరేవు ప్రమాద ఘటనా స్థలంలో
యుద్ధ ప్రాతిపదికన స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

ప్రజాశక్తి - తాళ్లరేవు

జాతీయ రహదారి 216 పై తాళ్లరేవులో ఈనెల 14వ తేదీ ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మతిచెందడంతో అధికారులు అప్రమత్త మయ్యారు. నేషనల్ హైవే అధికారులు పోలీసు శాఖ సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేశారు.జాతీయ రహదారి నుంచి గ్రామీణ ప్రాంత రహదారులకు అనుసంధానంగా ఉన్న కోరంగి పంచాయతీ ఘటన ప్రాంతంలో చిన్న బొడ్డు వెంకటరాయపాలెం, సీతారామపురం వెళ్లే రహదారులకు బ్రేకర్లు నిర్మించారు. అదేవిధంగా చొల్లంగి, జి.వేమవరం, పటవల, పోలేకురు, తాళ్ళరేవు రహదారులకు స్పీడ్ బ్రేకర్లను నిర్మించారు. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొండపై ఓ సన్నివేశంలో విజయ్ దేవరకొండ మురళీ శర్మ శరణ్య లకు సన్నివేశంపై వివరిస్తునన దర్శకుడు శివ

ఎగసిపడుతున్న అలలు
కోతకు గురవుతున్న బీచ్ రోడ్డు

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

ఉప్పాడ సముద్ర తీరం ఒక్కసారిగా మార్పు చెందడంతో బుధవారం ఎగసిపడుతున్న అలల తాకిడికి ఉప్పాడ కాకినాడ బీచ్ రోడ్డు కోతకు గురవుతోంది. ఉధృతమైన అలల తాకిడికి రక్షణగా వేసిన రాళ్లు బీచ్ రోడ్డుపైకి చేరడంతో పాటు, అటుగా వెళ్లే వాహనదారులు తడిసిపోవాల్సి వస్తోంది. దీంతో కాకినాడ చేరు కోవాలంటే ఉప్పాడ, కొనపపేట, మూలపేట, తదితర గ్రామాలకు పిఠా పురం మీదగా వెళ్లాల్సి వస్తుందని పలువురు తెలిపారు. శుక్రవారం అమా వాస్య కావడంతో అలలు ఇంకా ఎగసిపడతాయని మత్స్యకారులు తెలిపారు.


ధ్వంసమవుతున్న బీచ్ రోడ్డు

రత్నగిరిపై ముగిసిన ఖుషి సినిమా సందడి

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం దేవస్థానం రత్నగిరి కొండ పైన మంగళవారం నుండి ప్రారంభమైన ఖుషీ సినిమా షూటింగ్ సందడి బుధవారం సాయంత్రంతో ముగిసింది. మైత్రి మూవీస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ సినిమాలో సత్యదేవుని కళ్యాణ ఉత్సవాల ఘట్టాలు సంబంధించిన సన్నివేశాలను దర్శకుడు శివ చిత్రీకరిం చారు. విజయ్ దేవరకొండ, సమంత హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాలో మురళీశర్మ, శరణ్య తదితర నటీనటులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్‌ను నిషేధించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ ను నిషేధించాలని కోరంగి రేంజర్ దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం కోరంగి, దిండి గ్రామాల్లో ప్లాస్టిక్‌ను ఉపయోగించడం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. గ్రామంలో ఉన్న ప్లాస్టిక్ పోగుచేసి దగ్ధం చేయించారు. ఈ సందర్భంగా కోరంగి రేంజర్ దుర్గాప్రసాద్ ఎపి అటవీశాఖ లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్ కార్యక్రమంలో భాగంగా వైల్డ్ లైఫ్ రేంజ్ కోరింగ, కాకినాడ డివిజన్ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధంపై జూన్ 5వ తేదీ వరకు తాళ్లరేవు మండలం లోని పలు గ్రామాల్లో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోరంగి ఉపసర్పంచ్ కామారెడ్డి భైరవమూర్తి, ఎఫ్ ఎస్ఓలు నాగార్జున, వీరభద్రరావు, ఎఫ్‌బిఒలు మహేష్, ధనుంజయారావు,. గోపీ నాగేంద్ర కుమార్, సుబాని, వరలక్ష్మీ, ధనలక్ష్మి, శ్రీప్రియ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై వివరిస్తున్న అటవీ శాఖ అధికారులు

మహిళ హత్య కేసులో దర్యాప్తు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండల కేంద్రం ఆత్రేయపురం దళిత చిన్న పేటలో జరిగిన నక్కా మహాలక్ష్మి హత్య కేసులో బుధవారం రాత్రి కొత్తపేట డిఎస్‌పి కె. వెంకటరమణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు హత్య జరిగిన ప్రదేశంలో స్థానిక ఎస్ఐ సిహెచ్.సుధాకర్ తో కలిసి స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు స్థానికులు మాట్లాడుతూ మహాలక్ష్మి హత్య చేసిన నిందితులను త్వరగా పట్టుకుని న్యాయం చేయాలన్నారు. స్థానిక పోలీసులు కేసుని నీరు కార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. డిఎస్‌పి మాట్లాడుతూ మహాలక్ష్మి హత్య కేసు దర్యాప్తు వేగవంతంచేస్తామన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న డిఎస్‌పి

CHANGE OF NAME

My Old Name is PALLA SIVA. My New Name is PALLA SURESH KUMAR, S/o. Palla Nukaraju, D.No. 29-5-8, Surya Palace Road, Lakshmivarapu peta, Rajamahendravaram - 533104 (Cell No. 99664 87327). Since today onwards I am calling as **PALLA SURESH KUMAR** (New Name).

ఇంటి స్థలం దస్తావేజులు పడిపోయినవి

గోపాలపురం మండలం, గోపాలపురం గ్రామానికి చెందిన షేక్ చాందిని, W/o. షేక్ మొహిద్దీన్ కు గోపాలపురం రెవిన్యూ పరిధిలో **డాక్యుమెంట్ నెంబరు 629/1991**లో 4 సెంట్లు ఖాళీ స్థలం కలదు. ది. 10-5-2023న మేము ఇల్లు మారుచుండగా పడిపోయినవి. దొరికినవారు ఈ అడ్రసుకు, ఫోన్ నెంబరుకు తెలియచేయవలసిందిగా కోరుచున్నాను.

షేక్ చాందిని
W/o. షేక్ మొహిద్దీన్, గోపాలపురం,
గోపాలపురం మండలం, తూ॥గో॥జిల్లా
సెల్: 9505032354

దస్తావేజులు పడిపోయినవి

తూర్పుగోదావరి జిల్లా, అనపర్తి మండలం, మహేంద్రవాడ గ్రామం, డోర్ నెం. 10-158 కాపురస్తులయిన సబ్బెళ్ళ వీర వెంకట సత్యనారాయణరెడ్డి, W/o. శ్రీమతి గంగాలక్ష్మి చెందిన **దస్తావేజులు సర్వే నెం. 783/2011, 743/2011, 744/2011,** ది. 04-05-2023వ తేదీన పిఠాపురం నుండి కాకినాడ రూరల్ మండలం, తిమ్మాపురం వెళ్ళుచుండగా మార్గం మధ్యలో పడిపోయినవి. కావున ఎవరికైనా దొరికిన యెడల ఈ అడ్రస్ నందు సంప్రదించవలెను.

సబ్బెళ్ళ గంగాలక్ష్మి, W/o. సత్యనారాయణరెడ్డి
డోర్ నెం. 10-158, తోట వీధి,
మహేంద్రవాడ, అనపర్తి మండలం
తూర్పుగోదావరి జిల్లా

కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అధారిటీ

ప్రకటన

కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అధారిటీ (పూర్వపు గుడా) వారు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము, కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్ మండలం, తమ్మవరం గ్రామం, సూర్యారావుపేటలోని సర్వే నెం. 331 నందు 12,140.60 చ॥మీ॥ల విస్తీర్ణంలో బీచ్ పార్కు ప్రాజెక్ట్ నిర్మాణపు ప్రతిపాదనల కొరకు కేంద్ర పర్యావరణ అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ వారి నుండి సి.ఆర్.జెడ్ అనుమతులు ఫైల్ నెం. 11/4/2022-IA.III, తేది: 19-4-2023 ద్వారా పొందియున్నారు. సదరు అనుమతుల కాపీలు కేంద్ర పర్యావరణ అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ వారి వెబ్‌సైట్ నందు అందుబాటులో ఉన్నాయి.

సం/- **వైస్-చైర్మన్**
కావుడా, కాకినాడ

పురపాలక సంఘం - అమలాపురం

ఆర్.ఓ.సి. నెం. 758/2020-ఇ1 తేది: 17-05-2023

ఇ-ప్రొక్యూర్‌మెంటు షార్టు టెండరు నోటీసు

అమలాపురం పురపాలక సంఘ పరిధిలో సాధారణ నిధులతో నలభై ఏడు (47) పనులకు రూ. 234.90 లక్షలతో మరియు 15వ ఆర్థిక సంఘ నిధులతో రెండు పనులకు రూ. 35.79 లక్షలతో ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండరు పిలువబడినది.

టెండరు షెడ్యూల్ డౌన్ లోడింగ్ ప్రారంభ తేది: 15-05-2023 సా॥ 07.00ల నుండి
ముగింపు తేది: 01-06-2023 సా॥ 04.00ల వరకు

మిగిలిన వివరములు www.tender.apeprocurement.gov.in వెబ్‌సైట్ నందు చూడగలరు.

సం/- **కమిషనరు**
అమలాపురం పురపాలక సంఘం